www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 26 | ఆగస్టు | 2025
పేజీలు : 6

## యువతి మృతి పట్ల బంధువుల రాస్తారోకో

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : పూల లక్ష్మీ ప్రసన్న రాజమండ్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనకు భర్త, ఆడబిడ్డ, భర్త ఈమె మృతికి కారణమంటూ బంధువులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం రాజమండ్రి నుంచి తీసుకువస్తుండగా శ్రీ లక్ష్మీ తులసీ ఆగ్రో పేపర్‌బోర్డు సమీపంలో బంధువులు అడ్డంగించి భర్తను కొట్టారు. ఇంట్లో ఉన్న ఆమె అక్కపై కూడా దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి ఎంత సర్ధిచెప్పినా మృతురాలి బంధువుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో పోలీసులే ముద్దాయిలను కాపాడుతున్నారని కల్లూరు నుంచి వచ్చిన మృతురాలి బంధువులు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగా రాస్తారోకోతో ఆందోళన చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపు భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయమేర్పండి. సిఐ, దమ్మపేట, అశ్వారావుపేట ఎస్సైలతో పాటు పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఎంత చెప్పినా వినక పోవడంతో ఆ పరిస్థితుల్లో లాఠీచార్జి వరకు వెళ్లింది. మృతురాలు భర్త బావను కావాలనే పోలీసులు కాపాడుతున్నారన్నారు. అనుమానస్పద కేసు నమోదు చేయటమేమిటని, భర్త, అక్క, బావలు ఆమెను రెండేళ్ల పాటు చిత్రహింసలు పెట్టి గృహ నిర్బంధం చేసి మృతికి కారణమయ్యారని ఆరోపించారు. అంతలో అటువైపు నుంచి వస్తున్న మిగతా 2లో..

# సైబర్ నేరాల సుడిగుండం..!





### - రక్షణ కవచం ఎలా ?
### - స్వీయరక్షణ పెద్ద యుద్ధమే

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: ప్రస్తుత డిజిటల్ యుగంలో సమాజాన్ని పట్టిపీడిస్తున్న వాటిల్లో సైబర్ సమస్య అతిపెద్దది. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వికాసంతో పాటు వినాశనానికీ దారితీస్తోంది. సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్ల పన్నుతున్న వలలో చిక్కుకుని ఎందరో అమాయకులతో పాటు విజ్ఞానవంతులు సైతం బలైపోతూ వారి కష్టార్జితాన్ని, వ్యక్తిగత సమాచారాన్ని కోల్పోతున్నారు. ఈ నేరాల నుండి తప్పించుకునేందుకు ప్రజలకు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కంప్యూటర్లు, ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లు వంటి డిజిటల్ పరికరాలను ఉపయోగించి చేసే చట్ట విరుద్ధ కార్యకలాపాలు, ఆర్థిక మోసాలు, వ్యక్తిగత సమాచారం తస్కరించడం సైబర్ బెదిరింపులు, హ్యాకింగ్ వరకు అనేక రకాల సైబర్ నేరాలు ప్రస్తుతం విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో సైబర్ నేరగాళ్లు ఒక్కడుకు ముందుకేసి ప్రముఖులను టార్గెట్ చేసుకుని వారి బ్యాంకుల వివరాలు, ఆధార్ కార్డు, ఇతర వివరాలను సేకరిస్తున్నారు. సదరు వ్యక్తులకు ఫోన్లు చేసి కేంద్ర ప్రభుత్వ ఇంటిలిజెన్సీ విభాగానికి చెందిన వారమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. మీ బ్యాంకు ఖాతాలో ఇంత మొత్తం డబ్బులు ఉన్నాయి. మరో ఖాతాలో ఇంత ఉన్నాయి. మీరు ఆర్థిక లావాదీల విషయంలో ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారంటూ గంటలకొద్దీ వీడియోకాల్స్ చేస్తూ, మిగతా 2లో..

## యూరియా కేటాయింపులో వివక్ష




### -రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
### -అధికారులకు వినతి పత్రాలు

ప్రజాపక్షం/ ఖమ్మం : యూరియా కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నేతలు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేయడంలో విఫలమైందని వారు స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. పాలకులు యూరియాను అందించడంలో ఘోరంగా వైఫల్యం చెందారని సిపిఐ, రైతు సంఘాల నేతలు ఆరోపించారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నా పట్టించుకునే స్థితిలో అధికార యంత్రాంగం లేదని సాగు విస్తీర్ణం కావాల్సిన యూరియా తదితర విషయాలపై అధికారులు అంచనా వేయడంలో వైఫల్యం చెందారన్నారు. ఇప్పుడు మాగాణితో పాటు మెట్ట పంటలకు కూడా యూరియా అవసరం ఉందని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించాల్సిన యూరియాలో 30 శాతం తగ్గింపు చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్షకు పాల్పడుతుందని ఆరోపించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం జిల్లా నాయకత్వం నేతృత్వం వహించింది.

## చవితి సంబురాలకు
# సిద్ధమవుతున్న పందిళ్లు..!

### -గణేష్ ఉత్సవాలపై స్థానిక సమర ప్రభావం




ప్రజాపక్షం/ఖమ్మం : వినాయక చవితి సంబురాలకు సర్వం సిద్ధమవుతుంది. ఈనెల 27న వినాయక చవితిని పురస్కరించుకుని గణేష్ నవరాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు సిద్ధమవుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది గణేష్ మండపాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే తాము ఎంచుకున్న ప్రదేశాలలో మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పనులు ప్రారంభించారు. ఈ ఏడాది గణేష్ ఉత్సవాలపై స్థానిక ఎన్నికల ప్రభావం కనపడుతుంది. అతి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికలు జరుగుతాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు విరివిగా వినాయక ఉత్సవాలకు విరాళాలు ఇస్తున్నారని ప్రచారం జరుగుతుంది. పోటీ మిగతా 2లో..

# సైబర్ నేరాల సుడిగుండం..!

(మొదటిపేజీ తరువాయి)
కదలనివ్వకుండా, ఊపిరి సలుపుకోనివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారు.

**ఇదిగో మోసం ఇలా...**

సైబర్ నేరగాళ్లు అత్యంత తెలివితో అనేక రకాలుగా మోసాలకు పాల్పడుతుంటారు.

* బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, ఆధరణ పొందిన కంపెనీల నుండి వచ్చినట్లు నమ్మబలికి నకిలీ లింకులు,ఈ మెయిల్స్ ద్వారా వ్యక్తి గత వివరాలైన నెట్‌బ్యాంకింగ్, పాస్‌వర్డ్‌లు, ఓటిపిలు, క్రిడెట్/డెబికార్డు వివరాలు సేకరిస్తారు.

* గ్రామర్ తప్పులు, అసాధారణమైన ఈమెయిల్ అడ్రస్‌లు, అధికారిక వైబ్‌సైట్‌కు బిన్నంగా కనిపించే లింకులు, బ్యాంకు ఉద్యోగుల్లా, పోలీస్ అధికారుల్లా నమ్మబలుకుతూ ఓటిపిలు, సివివి,పిన్ నెంబర్లు అడుగుతుంటారు. ఇక్కడ విషయం ఏమిటంటే బ్యాంకులు ఎప్పుడూ ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు ఓటిపిలు అడగవు.

* బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, కేవైసి అప్‌డేట్ చేయాలని నకిలీ ఎస్‌ఎంఎస్‌లు పంపి లింకులు ద్వారా మోసాలకు పాల్పడుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఆకర్షణీయమైన ఆఫర్ల వివరాలు తెలియని నెంబర్ల నుండి ఫోన్లు వస్తుంటాయి.

* అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు ఇప్పిస్తామని, ప్రాసెసింగ్ ఫీజులు, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో డబ్బులు దండుకుంటున్నారు. ఉద్యోగాలకు కంపెనీ వివరాలతో ఆఫర్ లెటర్లు లేనిదే అడ్వాన్స్ రూపంలో డబ్బులు చెల్లింకుండా ఉండాలి.

* పెళ్లి సంబంధాల సైట్లు, డేటింగ్ యాప్‌లలో పరిచయం చేసుకుని, విదేశాల నుండి వస్తున్నామని, కస్టమ్స్ లో ఇరుక్కున్నామని నకిలీ కథలు చెప్పి డబ్బులు వసూళ్లు చేస్తుంటారు.

* క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు పంపడానికి స్కాన్ చేయమని చెప్పి నిజానికి డబ్బులు స్వీకరించడానికి బదులు మన ఖాతాలో ఉన్న డబ్బులు దోచుకునేలా చేస్తుంటారు.

* ఆర్మీ,సిఆర్‌పిఫ్ జవాన్లం, మాకు దూర ప్రాంతాలకు బదిలీ అయ్యింది. మా వద్ద విలువైన ఇంటి పరికరాలైన ఫ్రిజ్, బెడ్, సోఫా, డైనింగ్ సెట్, ల్యాబ్‌ట్యాప్ వంటివి ఉన్నావి. వాటిని అక్కడికి తీసుకెళ్లడానికి రవాణా ఖర్చు అధికంగా అవుతుంది, కాబట్టి పలానా ఆధికారి మీ నెంబర్ ఇచ్చారు. వాటిని అతి తక్కువ ధరకు ఇచ్చేస్తామని నమ్మబలికి, ఫోన్ పై, గుగుల్ పే ద్వారా డబ్బులు బదిలీ చేయమని అంటారు.

**ఇవిగో జాగ్రత్తలు...**

సైబర్ నేరగాళ్ల బారినుండి రక్షణ పొందేందుకు కాస్తంతా తెలివిగా వ్యవహరిస్తే సరిపోతుంది.

* ఎవరితోనూ వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. * ఓటిపి నెంబర్లు, పాస్వార్డ్‌లు, సివివి వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి ఇవ్వకూడదు.

* బలమైన పాస్‌వార్డ్‌లు వాడాలి. మీ అన్ని ఆన్‌లైన్ ఖాతాలకు బలమైన, భిన్నమైన చిన్న, పెద్ద అక్షరాలతో పాటు సంఖ్యలు, ప్రత్యేక అక్షరాల కలయికతో పాస్వార్డులు పెట్టుకోవాలి. వాటిని క్రమం తప్పకుండా మారుస్తూ ఉండాలి.

* లింక్‌లు క్లిక్ చేసే ముందు జాగ్రత్తలు పాటించాలి. తెలియని ఈ మెయిల్‌లు, ఎస్‌ఎంఎస్‌లలోని లింక్‌లు క్లిక్ చేయవద్దు, అవి నకిలీ వైబ్‌సైట్లకు దారితీసే అవకాశం ఉంది.

* కంప్యూటర్, మొబైల్ ఫోన్లలో విశ్వసనీయమైన యాంటీ వైరస్ సాఫ్ట్ వేర్‌ను ఇన్‌స్టాల్ చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.

* ఆపరేటింగ్ సిస్టమ్ బ్రౌజర్‌లు, యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడం వల్ల భద్రతా లోపాలు సరవుతాయి. పబ్లిక్ వైఫై నెట్‌వర్కులు ఉపయోగించే సమయంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్,షాపింగ్ వంటి సున్నితమైన లావాదేవీలు చేయడం మంచిది కాదు.

* గుగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ వంటి అధికారిక స్టోర్‌ల నుండి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇతరత్రా వచ్చే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవడం మంచిది కాదు.

* సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని ఎక్కువగా పంచుకోవడం సరికాదు. మీ ప్రొఫైళ్లను ప్రైవేటుగా సెట్ చేసుకోవాలి.

* బ్యాంకు స్టేట్‌మెంట్లను పర్యవేక్షించాలి.

* అనుమానాస్పద లావేదీలు ఉంటే వెంటనే బ్యాంకులకు సమాచారం ఇచ్చి భద్రత పొందాలి.

**సైబర్ నేరానికి గురైతే ఇలా చేయాలి...**

* సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలి, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.గవ్.ఇన్(www.sybercrime.gov.in) వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ఫిర్యాదు చేయాలి.

* సంచార్ సాంథీ పోర్టల్ (www/sancharsaathi.gov.in)లో రిపోర్టు చేయాలి.

* మోసానికి సంబంధించిన కాల్‌రికార్డులు, మెసేజ్‌లు, స్కీన్‌షాట్‌లు వంటి సాక్షాలు భద్ర పరచాలి.

* బ్యాంకుకు తెలియకుండా ఆర్థిక మోసం జరిగితే వెంటనే బ్యాంకును సంప్రదించి కార్డులను బ్లాక్ చేయించాలి.

* సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్దతుల్లో తెగబడుతుంటారు కాబట్టి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి,

* భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ సైబర్ నేరాల భారి నుండి మనల్ని మనం కాపాడుకోవడానికి పెద్ద యుద్ధమే చేయాలి.

# చవితి సంబురాలకు సిద్ధమవుతున్న పందిళ్లు..!

(మొదటిపేజీ తరువాయి)
అభ్యర్థులు గణేష్ ఉత్సవాల ద్వారానే తమ ప్రతాపాన్ని చూపాలని ప్రయత్నిస్తున్నారు. విగ్రహాలను బహూకరించడం, అన్నదాన కార్యక్రమాలకు ఆర్థికంగా సాయం చేయడంలో నిమగ్నమయ్యారు. మొత్తంగా ఈ ఏడాది గణేష్ ఉత్సవాలకు ఒక ప్రత్యేకత సంతరించుకుంది.

**ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించండి : కలెక్టర్ అనుదీప్**

వైభవోపేతంగా, ప్రశాంతంగా గణేష్ నవరాత్రోత్సవాలను నిర్వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తో కలిసి సమావేశం నిర్వహించారు. నవరాత్రోత్సవాల సందర్బంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, మండపాలకు విద్యుత్ సరఫరా, నిమజ్జనం ప్రదేశాల ఎంపిక తదితర విషయాలలో ప్రణాళికాబద్దంగా వ్యవహరించాలని సూచించారు. ఖమ్మంజిల్లాలో ఏడు చోట్ల నిమజ్జనం జరిగే ప్రాంతాలు ఉన్నాయని వాటి వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని బారీకేడ్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. భారీ విగ్రహాల తరలింపుకు సంబంధించి రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. వీలైతే పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ సూర్యస్తమాయానికి ముందే ఊరేగింపు ప్రారంభం కావాలని, విగ్రహాలు తరలించే వాహనాలను ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసాచారి, డిపివో ఆశాలత, డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి : కలెక్టర్




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టి ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించడానికి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయని తెలిపారు. నాలుగేళ్లు నిండిన బాలబాలికలు చేరవచ్చని తెలిపారు. మండల విద్యాధికారులతో పాటు ఐసిడిఎస్ అధికారులు, ఉపాధ్యాయులు ఇందు కోసం కృషి చేయాలన్నారు. కావాల్సిన యూనిఫాంలు, పుస్తకాలు, క్రీడా పరికరాలు అందిస్తామని, పాఠశాలలను రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పిల్లలను ఆకర్షించాలన్నారు. పిల్లకు మధ్యాహ్న భోజన, అల్పాహారం అందేలా చూస్తామన్నారు. ప్రతీ పాఠశాల్లో కనీసం 20 మంది పిల్లలు ఉండేలా చూడాలని, సెప్టెంబర్ 1వ తేదినాటికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి పండుగ వాతావరణంలో పిల్లలను బడుల్లో చేర్పించుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖాధికారి నాగలక్ష్మి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలతలెనినా, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతి మృతి పట్ల బంధువుల రాస్తారోకో

(మొదటిపేజీ తరువాయి)
మృతురాలి భర్త, బావను చూసి బంధువులు ఒక్కసారి వారిపై దాడి చేసే ప్రయత్నంలో పక్కనే పోలీస్ వాహనం ఎక్కి దాకున్నారు. దీంతో బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురై పోలీస్ వాహనంలో కావాలని నిందితున్ని దాచిపెట్టారని ఆగ్రహించారు. అనంతరం పోలీసుల సహాయంతో మృతదేహానికి స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు కుమార్తెతో తలకొరివి పెట్టించారు. ఈ విషయంపై సిఐను వివరణ కోరగా కేసు నమోదు చేయటం జరిగిందని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించిన మేము ఎవరిని దాచలేదని, దాడి చేయబోతే పోలీస్ వాహనంలో దాక్కున్నాడని, చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

# ఏసిబికి చిక్కిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రూ.25 వేలు లంచంతీసుకుంటూ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింహారావు ఏసిబికి చిక్కిపోయారు. ఓ ఫెర్టిలైజర్ షాపు యజమానికి ఆయన గత కొద్దిరోజుల క్రితం షోకాజ్ నోటీసు జారీ చేశారు. దానిని అపసంహరించుకునేందుకు రూ.25వేల లంచాన్ని విద్యానగర్‌లోని తన కార్యాలయంలో తీసుకుంటుండగా వలపన్ని రడ్ హ్యాండెడ్‌గా ఏసిబి అధికారులు పట్టుకున్నారు.

# సూరమేని అకాల మరణం సిపిఐకి తీరని లోటు : సాబీర్ పాషా




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సూరమేని జనార్ధన్ అకాల మరణం సిపిఐకి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాష అన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి లోని రామవరం 19వ డివిజన్‌లో ఉన్నం దాష్‌గడ్డ శాఖ 1 కార్యదర్శి జనార్ధ్ బ్రెయిన్ డెడ్‌తో ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ మృతి చెందారని చెప్పారు. సిపిఐకి, ఆయన కుటుంబానికి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ఆకర్షిత రాజకీయాలాకు తావివ్వకుండా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని, ఎన్ని ఒడిదుడుకులు విచ్చనా ఈ ప్రాంత సిపిఐ నిర్మాణం కోసం తుదిశ్వాస వరకు పనిచేశారన్నారు. అనంతరం 30 ఆటోలతో ర్యాలీగా వెళ్లి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, మునిగడప పద్మ, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మరి గోపి, తుముల శ్రీనివాస్, మండల రాజు, గుత్తుల శ్రీనివాస్, కమల్, గంటాడు కోటేశ్వర రావు, బయన్న ఈశ్వరయ్య, అజ్మీత్ పాషా, ఎస్కే జలీల్, తోగరు నరేంద్ర, బానోత్ చందర్, గగులోతు శంకర్, ఖయ్యూం, బానోత్ శ్రీనివాస్, దాట్ల శ్రావణ్, మునిగడప పద్మ, కరిష్మా, రత్నకుమారి, మహబూబి, షాహిన్, విజయలక్ష్మి , భాగ్య, మార్తమ్మ, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 13 మంది సైబర్ నేరగాళ్లు అరెస్ట్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలోని టేకులపల్లి మండలానికి చెందిన 13మంది సైబర్ నేరగాళ్లను అదుపులోనికి తీసుకున్నారు. ఈ మేరకు వలపల్లి టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వారిని పట్టుకున్నారు. ఈ మేరకు వారిని సోవవారం ఎస్పి మీడియా ముందు ప్రవేశపెట్టిన అనంతరం రిమాండ్ నిమిత్తం ఇల్లెందు కోర్టుకు తరలించారు. వివరాల ప్రకారం టేకులపల్లిలో మీ సేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్న బోడా శ్రీధర్‌కు టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు ఇతరులకు నగదు బదిలీ చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పడంతో ఇతనితో పాటు టేకులపల్లి మండలానికి చెందిన మరో 12 మంది చదువుకున్న యువకులు నకిలీ పత్రాలతో 60బ్యాంకు ఖాతాలు తెరిచారు. ఈ ఖతా నెంబర్లతో ఇతరుల బ్యాంకు ఖాతాల్లోకి నగదును పంపిస్తూ కమీషన్లు పొందుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. గత ఆరు నెలలుగా మొత్తం రూ.8.5 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ సైబర్ నేరగాళ్ల నుండి 12 సెల్ ఫోన్లు, బ్యాంకు పాస్ బుక్‌ని స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దేశవ్యాప్తంగా వీరి బ్యాంకు ఖాతాలపై 108 ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు టేకులపల్లి సిఐ సత్యనారాయణ ఎస్ఐ రాజేంధర్, సైబర్ క్రైం సిఐ జితేంధర్ సిబ్బందిని ఎస్‌పి రోహిత్ రాజ్ అభినందించారు. సైబర్ నేరగాళ్లు రకరకాలుగా అమాయకులను మోసం చేస్తూ వారి ఖాతాల్లో నుండి డబ్బులను కాజేయాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజలు నేరాల భారిన పడకుండా అన్నిపోలీస్ స్టేషన్ల పరిధిలోని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇలాంటి నేరాలకు ఏవరైనా పాల్పడితే చట్టరిత్యా చర్యలుంటాయని,నగదు కోల్పోయిన వారు 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కోల్పోయిన నగదును తిరిగి పొందేందుకు వీలుంటుందని పోలీస్ అధికారులు తెలిపారు. పట్టుబడిన సైబర్ నేరగాళ్లలో బోగా శ్రీధర్, బోడా రాజేష్, బోడా రాజన్న, బానోత్ జగదీష్, తేజావత్ నరేష్, పోలెపొంగు ప్రవీణ్ కుమార్, భూక్యా వీరన్న, జటోత్ నరేష్, బోడా జంపన్న, బోడా రాజారామ్, భూక్యా ప్రవీణ్, మాలోత్ ప్రవీణ్, ఉరిమళ్ల భరత్‌కృష్ణ ఉన్నారు.

# సేవా ధృక్పథంతో వైద్య సేవలు

**-ప్రజల ముంగిటకు అధునీక వైద్యం**
**-మమతలో అరుదైన గుండె శస్త్ర చికిత్స**
**-మమత సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వ్యాపార ధృక్పథంతో కాకుండా సేవా ధృక్పథంతో మమత వైద్య సంస్థల్లో వైద్య సేవలను అందిస్తున్నట్లు మమత వైద్య విద్యా సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ తెలిపారు. ప్రజల ముంగిటకు అధునీక వైద్యాన్ని అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం మమత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పువ్వాడ జయశ్రీ మాట్లాడుతూ 28 సంవత్సరాలుగా మమత వైద్య సంస్థలు ప్రజలకు సేవా ధృక్పథంలో వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన అత్యాధునీక వైద్య సేవలను సైతం అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. 2014లో గుండె విభాగానికి సంబంధించి కూడా సూపర్ స్పెషాలిటీ సేవలను మమత ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో అన్ని విభాగాలకు సంబంధించి అత్యాధునీక సౌకర్యాలతో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలను మమతలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. నిరుపేదలకు ఆరోగ్యశ్రీలో ఉచితంగా గుండె సంబంధిత శస్త్ర చికిత్సలతో పాటు ఇతర శస్త్ర చికిత్సలు కూడా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

**గుండె శస్త్ర చికిత్స విజయవంతం...**

హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితమైన గుండె శస్త్ర చికిత్సను విజయవంతంగా మమత ఆసుపత్రిలో నిర్వహించినట్లు గుండె వైద్య నిపుణులు విజయ్ కుమార్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన 18 సంవత్సరాల తేజశ్రీ అనే యువతి పుట్టుకతోనే గుండెలో రంధ్రాలు ఏర్పాడ్డాయన్నారు. కాల క్రమేణ రెండు రంధ్రాలు పూడుకుపోయాయని ఒక రంధ్రం అలాగే ఉండడంతో ఆమె రక్తహీనతతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ పలు ఆసుపత్రులకు వెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తేజశ్రీ మమత ఆసుపత్రి వైద్యులను సంప్రదించినట్లు తెలిపారు. ఆమెకు అన్ని పరీక్షలు నిర్వహించి గుండెకు ఓపెన్ సర్జరీ విధానంలో కాకుండా బటన్ సర్జరీ విధానం ద్వారా రంధ్రాన్ని పూడ్చినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. ఆరోగ్యశ్రీలో పూర్తి ఉచితంగా ఈ శస్త్ర చికిత్సను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారు ఐదు సంవత్సరాలు నిండిన వారందరికీ అధునీక పద్దతుల్లో మమతలో గుండెకు సంబంధించిన అన్ని రకాల శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీలో ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మంజిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుండెకు సంబంధించి పూడుకుపోయిన రంధ్రాలను కేవలం హైదరాబాద్ వంటి నగరాల్లో మాత్రమే శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. మొట్టమొదటి సారి ఓపెన్ హార్ట్ సర్జరీలో కాకుండా కేవలం ఒక్క రంధ్రంతో బటన్ సర్జరీ విధానంలో ఖమ్మం మమత ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మమత సంస్థల డైరెక్టర్లు డాక్టర్ నరేన్, డాక్టర్ సాయి శిరిణి, కార్డియాలజీ హెచ్‌వోడి ప్రవీణ్ కుమార్, డాక్టర్ వర ప్రసాద్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# వామపక్ష యుగస్వరం సురవరం

**-హవేలీ శాఖ ఆధ్వర్యంలో సురవరంకు నివాళి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తన జీవిత కాలం ప్రజా సమస్యల పరిష్కారానికి, వామపక్ష ఉద్యమ ఐక్యతకు కృషి చేసిన సురవరం సుధాకర్‌రెడ్డి వామపక్ష యుగ స్వరమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ తెలిపారు. పార్లమెంటు సభ్యునిగా, సిపిఐ అఖిల భారత కార్యదర్శిగా విశిష్ట సేవలను అందించారని ఆయన తెలిపారు. ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ నిర్వహించారు. సభకు ముందు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నానబాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో గాంధీ మాట్లాడుతూ విద్యార్థిగా ఉన్నప్పుడే తిరుగుబాటు స్వరం వినిపించారని ఆయన జీవిత కాలం తిరుగుబాటు పంధానే అవలంభించారన్నారు. సిద్ధాంత అవగాహన, విశదీకరణ, పోరాట మార్గాల రూపకల్పన తదితర విషయాలలో సురవరంకు మరొకరు సాటి లేరన్నారు. ప్రజా సమస్యలపై తక్షణం స్పందిస్తూ పరిష్కార మార్గాలను అన్వేషించే వారన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం కడ వరకు పని చేసిన సురవరం ధన్యజీవి అని ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అని గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జాకీర్, ఆముదాల వెంకన్న, పి. వెంకటేశ్వరరావు, పారా శ్రీనివాసరావు, ఎస్. ఉపేందర్, ఎల్. వెంకట్, చార్లెస్, బొర్రా వీరబాబు, అక్రం పాల్గొన్నారు.

# వక్ఫ్ భూములపై కబ్జా కన్ను

**-గెజిట్ సీరియల్ నెంబర్లను మారుస్తున్నారు**
**-సిపిఐ నేత సలాం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్‌లో కబ్జా కన్ను వక్ఫ్ భూములపై పడిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఇన్సాఫ్ నాయకులు మహ్మద్ సలాం ఆరోపించారు. వక్ఫ్ భూములకు విపరీతమైన డిమాండ్ రావడంతో కొందరు ఆ భూములను ఏదో ఒక రూపంలో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గొల్లగూడెం వక్ఫ్‌భూములకు సంబంధించి కుట్ర నడుస్తుందని గెజిట్‌లో ఉన్న భూములను కాదని ధృవీకరణ సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే గొల్లగూడెం, ముస్తఫానగర్, ఖిల్లా, పీర్లచావిడి తదితర పేర్లతో 80.8 ఎకరాల భూమి ఉందని ఆ భూమిని పూర్తి స్థాయిలో అప్పగించాలని అనేక ఏళ్లుగా ఆందోళన చేస్తున్నామని అయినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో వక్ఫ్ భూములను కాజేసేందుకు ఒక ముఠా తయారైందని ఆరోపించారు. ఈ వక్ఫ్ భూములకు సంబంధించి తక్షణం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట రేషన్ డీలర్లు నిరసన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ రేషన్ డీలర్లు ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట డీలర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ వెంకన్న మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా రేషన్ డీలర్లు పని చేస్తున్నారన్నారు. నెలల తరబడి రేషన్ డీలర్ల కమిషన్‌ను ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోడౌన్ ల నుంచి షాపులకు బియ్యం దిగుమతి చేసుకునే సమయంలో హమాలీ ఖర్చులు, షాపు అద్దె, కరెంటు బిల్లులు, హెల్పర్‌లకు అయ్యే ఖర్చులు చెల్లించలేక డీలర్లు అప్పుల పాలవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు ఇచ్చే కమిషన్‌ను వేర్వేరుగా కాకుండా పాత పద్దతిలోనే ఏ నెలకు ఆ నెల వారి వారి ఖాతాల్లో జమ అయ్యేవిధంగా చూడాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానిమియా, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.దుర్గయ్య, నగర అధ్యక్షులు షేక్ ఇబ్రహీం, బాబు, జానిమియా, యలగందుల సత్యనారాయణ, షరాబు మహేష్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, షేక్ రహీం, సిహెచ్ శ్రీనివాస్, సుశీల, రమణమ్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం అందించాలన్నారు. మన పరిధిలో చేయగలిగిన పనిని వెంటనే పూర్తి చేయాలని చేయలేని పక్షంలో దానికి గల కారణాలను, నిబంధనలను వివరిస్తూ సమాధానం ఇవ్వాలని సూచించారు. బోనకల్ మండలం చిరునోములకు చెందిన నిమ్మతోట నాగయ్య తాను నాగార్జున సాగర్ కాలువ బోనకల్ బ్రాంచ్ పరిధిలో ఐదేండ్లు పని చేసిన అనుభవం ఉందని అవుట్‌సోర్సింగ్ విధానంలో లస్కర్‌గా నియమించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమిషన్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే కమిషన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మంజిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్ మార్క్‌ఫెడ్ ద్వారా ఖరీఫ్ పెసర పంటను కొనుగోలుకు ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన ప్రజలు తనికెళ్ల నుంచి బోడ్యాతండా గ్రామానికి వెళ్లే డొంక రహదారి ఆక్రమణకు గురవుతుందని సర్వే చేసి అభివృద్ధి చేయాలని దరఖాస్తు చేశారు. ఖఖమ్మం నగరానికి చెందిన యనమందల కృష్ణబాబు తన కుమారుడు తెలంగాణ సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్నాడని తన కొడలికి అమర వీరుల కుటుంబానికి అందించే ప్రభుత్వ ఉద్యోగం అందించాలని దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే అవసరమైన చర్యలను తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలను తరలిస్తే ఆందోళన తప్పదు

**-గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదు**
**-ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కి వినతి**




**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ను సత్తుపల్లి కి తరలింపు విరమించుకోకపోతే ఆందోళన తప్పదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కల్లూరు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ కల్లూరు డివిజన్ కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారుగా వందమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభమైన అప్పటి నుంచి ఆశ్రమ పాఠశాలలో తరచుగా ఇప్పటికి మూడుసార్లు ఫుడ్ పాయిజన్ అవడం బాధాకరమన్నారు. విద్యార్థుల పట్ల ఆశ్రమం పాఠశాల వార్డెన్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి ఘటనలు మరలా పునరావతం అవుతున్నాయన్నారు. ఐటీడీఓ పిఓ ఐదు రోజుల క్రితం ఆశ్రమం పాఠశాలను సందర్శించి ఆశ్రమ పాఠశాల మరమ్మత్తుల కోసం సుమారుగా పది లక్షల రూపాయలు మంజూరు చేస్తున్న అని చెప్పి ఇప్పుడు రెండు రోజులు క్రితం ఖమ్మం జిల్లా గిరిజన డిప్యూటీ డైరెక్టర్ కల్లూరు ఆశ్రమ పాఠశాలను సత్తుపల్లికి తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ గల కారణాలను సమీక్షించకుండా కల్లూరు డివిజన్ కేంద్రంలోని గిరిజన ఆశ్రం పాఠశాలను సత్తుపల్లి కి తరలించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కల్లూరు లోనే గిరిజన ఆశ్రమ పాఠశాలను కొనసాగించాలని ఆయన అన్నారు. సత్తుపల్లికి తరలించాలని ఆలోచనలను విరమించుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, ఏఐఎస్ఎఫ్ కల్లూరు డివిజన్ సమితి నాయకులు వేము సందేశ్, క్రాంతి, తనీష్, ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు అవంతిక, శశికళ, నందిని, రచిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు

## సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి





ప్రజాపక్షం/చింతకాని : పేద ప్రజల కోసం నిరంతరం తపించి , కమ్యూనిస్టు పార్టీని కుటుంబంగా భావించి అసువులు బాసిన కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలో సిపిఐ పార్టీ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మిక కర్షక పీడిత జనావళి కోసం సుధాకర్‌రెడ్డి త్యాగాలు వెలకట్టలేనివని స్పష్టం చేశారు. విలువలతో కూడిన రాజకీయాలే చేసి విద్యార్థి దశ నుంచే ఉద్యమాల వైపు నడిచి ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులుగా, రెండు సార్లు నల్గొండ పార్లమెంటు సభ్యులుగా పనిచేసి పోరాటాలు నిర్వహించిన పోరాట యోధుడు సుధాకర్‌రెడ్డి అనిఅన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమనిర్మాణంలో కీలకపాత్ర పోషించాడన్నారు. గొప్ప మేధావిని కోల్పోవడం భాధాకరమని ఆయన మరణం చాలా భాదకరమన్నారు. ఈ సంతాప సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు , సహాయ కార్యదర్శులు అబ్బూరి మహేష్, మార్గం శ్రీను, రైతు సంఘం జిల్లా కోశాధికారి దొబ్బల వెంగళరావు, వ్యకాస నాయకులు సింగారావు సత్యనారాయణ, గోగుల ఆది, వేముల జానకిరామయ్య, కొల్లి రవి, మాజీఎంపీటీసీ నారపోగు హేమ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, మాజీమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పుచ్చకాయల గురువమ్మ సేవలు మరువలేనివి




ప్రజాపక్షం/కామేపల్లి: మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు, కామేపల్లి మండల సిపిఐ కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు సతీమణి గురువమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం తాళ్లగూడెం గ్రామంలోని వారి నివాస గృహంలో గురువమ్మ దశ దిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఏపూరి లతాదేవి, మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, వెంకట కృష్ణ, షేక్ సలీం, ఖమ్మం డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కామేపల్లి, కొండాయిగూడెం పిఎసిఎస్ ఛైర్మన్‌లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హనుమంతరావు, మండల పరిధిలోని వివిధ పార్టీల నాయకులు గురువమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువమ్మ మృతి సిపిఐకి తీరని లోటని, పార్టీకి ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సిపిఐ శ్రేణులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు

# ఆ సారు కొందరితోనే మాట్లాడతారు..!

## అంతా ఆయన ఇష్టమే

ప్రజాపక్షం/పాల్వంచ : ఆ సారుకు అందరితో మాట్లాడటం ఇష్టం ఉండదు. కొందరితోనే మాట్లాడటానికి ఆయనకు తీరిక ఉంటుంది. వారు ఎంచుకొన్న వారే వారికి అతి ముఖ్యులు. మిగతా వారు ఆయన కంటికి కనిపించరు. వారితో మాట్లాడరు. అందుకే ఆయన అందరి వాడు కాదని కొందరి వాడేనని అంటున్నారు. ఆయనకు ఫోన్ చేయాలంటేనే హడలెత్తి పోతుంది. ఇదీ పాల్వంచ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తీరు. ఈ నెల శుక్రవారం, 24వ, తేదీన ఓ ఆదివాసీ గిరిజన యువతిపై అఘాయిత్యానికి పాల్పడి అర్ధరాత్రి చర్ల మండలం నుండి ఆటోలో తీసుకొచ్చి పాల్వంచ జగన్నాధపురం గ్రామంలో వదిలేసి వెళ్ళారు. మెళుకువ వచ్చిన ఆ యువతికి తానున్న ప్రదేశం ఎక్కడుందో అర్థం కాలేదు. తన పరిస్థితి చూస్తే ఒంటిపై గాట్లు ఉన్నాయి. అప్పుడు తనపై అత్యాచారం చేసినట్లు గుర్తించినది. దీనితో ఆమె వేదన వర్ణనాతీతం . గమనించిన స్థానికులు బాలికా సంరక్షణ కేంద్రానికి తరలించారనేది పాఠకులకు విదితమే. ఈ విషయంపై పలుమార్లు గ్రామీణ పోలీసులను వివరణ కోరగా ఒకసారి విచారం చేస్తున్నామని అన్నారు. ఆలస్యం అవుతున్నదని అన్నారు. మరోసారి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్‌కి ఫోన్ చేయగా సెలవులో ఉన్నట్లు తెలిపారు. దీనితో హెడ్ కానిస్టేబుల్‌కు చేయగా సిఐని అడిగి తెలుసుకోండి అన్నారు. వెంటనే సిఐకి ఫోన్ చేయగా ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా బిజీ టోన్ వచ్చింది. ఆ తరువాత పది నిమిషాలకు చేయగా ఫోన్ కట్ చేశారు. మరో పది నిమిషాల తరువాత చేస్తే ఫోన్ రింగయ్యింది కానీ లిఫ్ట్ చేయలేదు. ఇంకో సారి చేయగా మధ్యలోనే కట్ చేసారు.ఇలా చేస్తున్న క్రమంలో మధ్య మధ్యలో ఆయన మరొకరితో మాట్లాడటం తెలుస్తోంది. అనంతరం మెసేజ్ చేసినా తిరుగు సమాధానం ఇవ్వకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ఉన్నారు. ఆయన ఇష్టం ఉన్న వారితోనే మట్లాడతారని, లేకుంటే మాట్లాడరని తెలుస్తోంది. ఓ బాధ్యత గల ఉద్యోగంలో ఉన్నారని, ఆయన ప్రజలకు కావలసిన అధికారి అంటూ ప్రభుత్వం 24 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండటానికి, ప్రజలకు అందుబాటులో ఉండటానికి, అవసరాలు తీర్చటానికి ప్రత్యేక ఫోన్ నెంబర్‌ను ఇచ్చింది. కానీ అట్టి ఫోన్‌కు సామాన్యులు ఫోన్ చేస్తే ఎంత మాత్రం సమాధానం ఇవ్వరని తీవ్రమైన ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారి తీరుతో పలువురు పెదవి విరుస్తున్నారు. కొందరితోనే మాట్లాడటం, ఇంకొందరితో మాట్లాడకపోవటం వంటివి ప్రజా జీవితాని దగ్గరగా ఉండే ఉద్యోగులకు తగవని అంటున్నారు. నేటి ఆధునిక రోజుల్లో జనం వింత పోకడలకు అలవాటు పడుతున్నారు. అందులో మంచి ఉన్నప్పటికీ కొందరు చెడు వ్యసనాలకు లోనై పలు అఘాయిత్యాలకు పాల్పడటం మనం రోజూ చూస్తూనే ఉన్నాం. వింటూనే ఉన్నాం. అలాంటి సంఘటనలు జరిగినపుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎవ్వరైనా ప్రయత్నం చేస్తారు. జరుగుతున్న ఆపదలో కాపాడేది ఒకే ఒక్కరు. వారే పోలీసులు, ఇక వారే ఫోన్ చేస్తే మాట్లాడకుండా ఉండటం చాలా ఇబ్బంది కరంగా మారుతుందని అంటున్నారు. సోమవారం గిరిజన యువతి పై జరిగిన దారుణ సంఘటన పై పలు మార్లు ఫోన్ చేసినప్పటికి స్పందించకపోవటం బాధాకరం. ఇప్పటికైనా అధికారి తీరు మార్చుకోవాలని అంటున్నారు. కొందరి వాడు కాదని అందరి వాడుగా ఉండాలని కోరుచున్నారు. కాగా గిరిజన యువతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అల్లూరి జిల్లా గొల్లదప్ప గ్రామానికి చెందిన యువతిగా తెలిసింది. చత్తీస్‌గఢ్ బోదగుడిలో ఉన్న తన పిన్నిగారింటి నుండి ట్రాలీ ద్వారా కుంటకు వచ్చింది. అక్కడ నుండి చట్టి గ్రామానికి ఆటోలో చేరుకొంది. అక్కడ నుండి తీసుకొచ్చిన ఆటో డ్రైవర్లు పాల్వంచ జగన్నాధపురం గ్రామంలో వదిలేసినట్లు సమాచారం. ఇదే కేసులో ఆటోను సంభందిత అధికారులు కనుగొన్నారని ఇద్దరు నిందితుల్లో ఒకరిని తెలుసుకొన్నట్లు తెలుస్తోంది. ఇట్టి విషయంపై సిఐ ద్వారా తెలుసుకోవటానికి పలుమార్లు ఫోన్ చేసినప్పటికి అందుబాటులోకి రాకపోవటం విచారకరం.

**అందుబాటులోకి రాని డిఎస్‌పి :**

ఈ విషయంపై డిఎస్‌పి సతీష్ కుమార్ వివరణ కోసం ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.

# వైరా మున్సిపల్ కమిషనర్‌గా గురులింగం బాధ్యతలు స్వీకరణ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ కమీషనర్గా గురులింగం సోమవారం బాధ్యతలు చేపట్టారు. నల్గొండ జిల్లా నడికొండ మున్సిపాలిటీలో కమీషనర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వైరా మున్సిపాల్ కమీషనర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపాల్ మేనేజర్ సుధాకర్, ఇతర సిబ్బంది ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. మున్సిపాల్ కమీషనర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం పలువురు ఉన్నతాధికారులు కలిశారు.

# రెండు లక్షలు చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలి

## -లాటరీ పద్ధతిలో ప్లాట్ల కేటాయింపు
## -రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్‌పై కలెక్టర్ సమావేశం





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్‌లో ప్లాట్ల కొరకు ఆసక్తి గల ఉద్యోగులు ఆగస్టు 30లోపు రెండు లక్షల రూపాయలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, రాజీవ్ స్వగృహ సిఈ భాస్కర్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్‌పై సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్ ప్రాజెక్టు 9.22 ఎకరాల్లో నిర్మించిన ఎనిమిది టవర్లలో అసంపూర్తిగా ఉన్న 576 ప్లాట్లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు నోటిఫికేషన్ జారీ చేసి సమావేశం నిర్వహించామని గజం భూమి రూ. 1150 ధర నిర్ణయించామన్నారు. ఉద్యోగులకు లాటరీ పద్ధతిన ప్లాట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. సొంత ఇల్లు కావాలన్న ఆసక్తి ఉన్న ఉద్యోగులు ఈ లాటరీలో పాల్గొని తమ కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. రివర్ వ్యూతో టవర్స్ బాగున్నాయన్నారు. ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి వల్ల రోడ్డు కనెక్టివిటి పెరుగుతుందని, మున్నేరు నదిపై రిటెనింగ్ వాల్ నిర్మాణంతో వరద ముంపు కూడా ఉండదని తెలిపారు. టౌన్‌షిప్ వద్ద 60 అడుగుల రోడ్డు, అన్ని రకాల అనుమతులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, టిజివో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, టిఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మధిర ప్రెస్ క్లబ్ ప్రమాణస్వీకార మహోత్సవం



ప్రజాపక్షం/ మధిర : మధిర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాధం, టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా నాయకులు పాపినేని రామనర్సయ్య, మండల కార్యదర్శి మందా సైదులు, బిజెపి జిల్లా నాయకులు కుంచం కృష్ణారావు, పలువురురాజకీయ నేతలు, ప్రముఖులు, అధికారులు పాల్గొని మాట్లాడారు. సమాజంలో జర్నలిస్టుల సేవలు ఎంతో విలువైనవని, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల సమస్యలను వెలికి తీసి వాటి పరిష్కారానికి కృషి చేయటంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. అలాంటి జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కమిటీకి ఘన సన్మానం చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుజ్జు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, గౌరవాధ్యక్షులు నాళ్ల శ్రీనివాస్‌రావు, గౌరవ సలహాదారుడు తమ్మారపు బ్రహ్మం, కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావు, సహాయ కోశాధికారి యడవల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శి ఎ.అర్జున్, సహాయ కార్యదర్శులుకు శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మధిరలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఎన్నో ఏళ్లుగా కలగా ఉన్న ఇండ్లస్థలాలు, ఇళ్ల మంజూరు విషయంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవ తీసుకోవాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ,ఇళ్లు ఇవ్వాలని, అదేవిధంగా అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, మధిర ప్రెస్ క్లబ్ కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వ సహకారంఅందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, మండల అధికారులు, పట్టణ ప్రముఖులు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాపక్షం/చంద్రుగొండ: రైతులకు యూరియా పంపిణీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ధారా బాబు విమర్శించారు. సోమవారం స్థానిక రైతు వేదికలో రైతులతో కలిసి నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వ్యవసాయ శాఖ అధికారి వినయ్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు వెంకటనారాయణ, భూపతి రమేష్, సురా వెంకటేశ్వర్లు, మేడ మోహన్‌రావు, రాఘవులు, శ్రావణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.